క్లుప్తంగా

ఆలయ గోపురంపై మొక్కల తొలగింపు



మొక్కలు తొలగింపు అనంతరం మరమ్మతు పనులు

కాకినాడ రూరల్: మండలంలోని సర్పవరం గ్రామంలో పురాతన ప్రసిద్ధ రాజ్యలక్ష్మి సమేత భావనారాయణస్వామి ఆలయం ఉత్తర గోపురంపై పెరుగుతున్న మొక్కలను మంగళవారం తొలగించారు. గోపురంపై ఏపుగా ఉన్న మొక్కలను వేళ్లతో సహా తొలగించి, అక్కడ ఊడిన పెచ్చులను కాంక్రీట్‌తో మరమ్మతు చేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ పుల్ల నారాయణరావు మాట్లాడుతూ మొక్కలు ఏపుగా పెరుగుతుండడంతో రాజగోపురానికి ముప్పు వాటిల్లకుండా వెన్నపు సత్తిబాబు, కోరమాండల్ అధికారి వేణు సహకారంతో తొలగించామన్నారు.

19న ప్రీ క్రిస్మస్ వేడుకలు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): ఆల్‌ఇండియా క్రిస్టియన్ కౌన్సిల్, జిల్లా పాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో ఈనెల 19 ఆదివారం ప్రీ క్రిస్మస్ వేడుకలు జిల్లాస్థాయిలో ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆల్‌ఇండియా క్రిస్టియన్ కౌన్సిల్ కాకినాడ జిల్లా శాఖ అధ్యక్షుడు రిక్కిగూటం మంగళవారం తెలిపారు. స్థానిక మెక్లారిన్ గ్రౌండ్స్‌లో జరిగే ఈ వేడుకలకు నైజీరియా నుంచి డాక్టర్ డబ్ల్యు కుమయి, దివంగత అంతర్జాతీయ దైవ సేవకులు దినకరన్ మనవడు బ్రదర్ సామ్యూల్ దినకరన్ ముఖ్యఅతిథులుగా హాజరవుతారన్నారు. ఏపీ పాస్టర్స్ ఫెలోషిప్ ఉపాధ్యక్షుడు రెవరెండ్ డాక్టర్ జి.జోసఫ్‌బెన్ని, జిల్లా పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షుడు దొమ్మేటి సామ్యూల్‌సాగర్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఈ వేడుకలకు కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర రెడ్డి గౌరవ అతిథిగా విచ్చేస్తున్నారన్నారు. 19వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు బెరాకా బెస్లింగ్స్ చర్చిలో ఆల్‌ఇండియా క్రిస్టియన్ కౌన్సిల్ ఆధ్వర్యంలో క్రిస్టియన్ డాక్టర్స్ మీట్ నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు.

పోలీసులకు మధుమేహ పరీక్షలు

కాకినాడ క్రైం: ప్రపంచ మధుమేహ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని కాకినాడ మోహన్ డయాబెటిస్ స్పెషాలిటీస్ సెంటర్ యాజమాన్యం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఉచిత మెడికల్ క్యాంప్ నిర్వహించింది. ఏఎస్పీ పి.శ్రీనివాస్ ఈ క్యాంప్‌ను ప్రారంభించారు. పోలీసులకు మధుమేహ, రక్తపోటు పరీక్షలు నిర్వహించారు. అనంతరం డాక్టర్ మోహన్ భవేష్ పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. పోలీసుల ఆరోగ్య సంరక్షణ కోసం ఉచిత వైద్య శిబిరం నిర్వహించినందుకు డాక్టర్ మోహన్ భవేష్ ఆయన బృందానికి ఎస్పీ సతీష్‌కుమార్ ధన్యవాదాలు తెలిపారు.

ప్రకృతి వైపరీత్యాలపై అప్రమత్తత అవసరం

కాకినాడ: ప్రకృతి వైపరీత్యాలు సంభవించిన సమయంలో సరైన అవగాహనతో అప్రమత్తతో తీసుకునే చర్యలే తీవ్ర నష్టాలను నివారిస్తాయని కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు పేర్కొన్నారు. స్థానిక జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ అధ్యక్షుడు వైడీ రామారావు అధ్యక్షతన మంగళవారం జరిగిన ప్రాకృతిక వైపరీత్యాల సందర్భంగా తీసుకోవలసిన చర్యలపై ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమంలో కమిషనర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. తొలుత రెడ్‌క్రాస్ వ్యవస్థాపకులు జీన్‌హెడ్రీడ్యూనాల్ట్, మాజీ ప్రధాని నెహ్రూ చిత్రపటాలకు నివాళులర్పించారు. జిల్లా రెడ్‌క్రాస్ చైర్మన్ వైడీ రామారావు మాట్లాడుతూ సచివాలయ రెవెన్యూ, వెల్ఫేర్ కార్యదర్శులకు ప్రకృతి వైపరీత్యాల నిర్వహణ, ప్రాథమిక చికిత్స వంటి అంశాలపై శిక్షణ శిబిరాలు నిర్వహించామన్నారు. రెడ్‌క్రాస్ కార్యదర్శి శివకుమార్, డాక్టర్ పరాశరణ్ పాల్గొన్నారు.

పారదర్శకమైన ఓటర్ల జాబితా లక్ష్యం

కాకినాడ: ఎన్నిక కమిషన్ ఆదేశాల మేరకు దోషరహిత, పారదర్శకమైన ఓటర్ల జాబితాను రూపొందించడంలో ప్రజలతోపాటు రాజకీయ పార్టీల ప్రతినిధులు కూడా సహకరించాలని కాకినాడ సిటీ నియోజకవర్గ ఈఆర్వో, కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు కోరారు. స్థానిక కార్పొరేషన్ కార్యాలయంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో మంగళవారం ఆయన సమావేశమయ్యారు. కమిషనర్ మాట్లాడుతూ ఇప్పటి వరకు ఫారం 6,7,8 ద్వారా దాదాపు 89వేల 769 దరఖాస్తులు రాగా, చాలా వరకు పరిష్కరించామని, మరో 17వేల దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఇవన్నీ వచ్చే ఏడాది జనవరి 5వ తేదీలోపు పరిష్కరిస్తామన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రతినిధులు రోకళ్ల సత్యనారాయణ, ఎంజీకే కిషోర్, టీడీపీ ప్రతినిధులు తుమ్మల రమేష్, గదుల సాయిబాబా, పాల్గొన్నారు.

రౌండ్ టేబుల్ సమావేశం

కాకినాడ సిటీ: సూర్యకళామందిరంలో టీడీపీ ఆధ్వర్యంలో బీసీలకు జరుగుతున్న అన్యాయాలపై ఐక్యపోరాటం, కుల సంఘాలు, ప్రజా సంఘాలు అఖిల పక్షాలతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. వనమాడి వెంకటేశ్వరరావు, రెడ్డి సుబ్రహ్మణ్యం, కాకినాడ రామారావు, పెంకే శ్రీనివాసరావు, చొల్లంగి వేణుగోపాల్, ఎమ్మెల్సీలు దువ్వారపు రామారావు, ఇళ్ల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

జగనే మళ్లీ కావాలి... ఆశీర్వదించండి

- ఎమ్మెల్యే కన్నబాబు
- గంగనాపల్లి, 1వ డివిజన్లలో 'ఏపీకి జగనే ఎందుకు కావాలి'



గంగనాపల్లిలో సంక్షేమ పథకాల డిస్ ప్లే బోర్డును ఆవిష్కరించిన ఎమ్మెల్యే కన్నబాబు



సమావేశంలో మాట్లాడుతున్న సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి

కాకినాడ రూరల్: ఆంధ్రప్రదేశ్‌కు మళ్లీ జగనే కావాలని ఆశీర్వదించాలని ప్రజలను ఎమ్మెల్యే కురసాల కన్నబాబు కోరారు. ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి కార్యక్రమంలో భాగంగా కాకినాడ రూరల్ మండలం గంగనాపల్లి, కాకినాడ అర్బన్ 1వ డివిజన్‌లో జరిగిన కార్యక్రమాల్లో మంగళవారం ఆయన పాల్గొన్నారు. గంగనాపల్లి సచివాలయం-2 పరిధిలోని చైతన్యనగర్‌లో జరిగిన కార్యక్రమంలో సంక్షేమ పథకాలకు సంబంధించి అధికారులు ఏర్పాటు చేసిన డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరించారు. గ్రామ సర్పంచ్ గీసాల మహాలక్ష్మి అధ్యక్షతన జరిగిన సభలో కన్నబాబు మాట్లాడుతూ గంగనాపల్లి సచివాలయం-2 పరిధిలో డీబీటీ, నాన్ డీబీటీల ద్వారా రూ.8.25 కోట్ల మేర ప్రజలకు లబ్ధి చేకూరిందన్నారు. సుమారు రూ.4 కోట్లతో అభివృద్ధి పనులు చేశామన్నారు. లోతట్టుగా ఉండే చైతన్యనగర్‌లో సిమెంట్ రోడ్లు ఏర్పాటు చేశామని, తాగునీటి సదుపాయాన్ని కల్పించామన్నారు. ఇంటింటికి కుళాయిలు కూడా ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్రంలో నాలుగున్నరేళ్ల పాలనలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలను నెరవేర్చారన్నారు. గత ప్రభుత్వంలో ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ' ఏరు దాటాక తెప్ప తగలేసిన చందాన ' చంద్రబాబు తీరు ఉంటుందని, ఆయనను నమ్మొద్దని, ఎందరు కలిసి వచ్చినా విజ్ఞతతో ఆలోచించి వైఎస్సార్ సీపీకే పట్టం కట్టాలన్నారు. జెడ్పీటీసీ సభ్యుడు నలుకుర్తి రామకృష్ణ, జేసీఎస్ మండల కన్వీనర్ గీసాల శ్రీనివాసరావు, ఎంపీటీసీ సభ్యురాలు వాసంశెట్టి సత్యవేణి, ఏఎంసీ చైర్మన్ గీసాల శ్రీను, సర్పంచ్‌లు బెజవాడ సత్యనారాయణ, రామదేవు చిన్న, సీనియర్ నాయకుడు గోపిశెట్టి బాబ్జి, ఈవోపీఆర్డీ రామాంజనేయులు, పంచాయతీ కార్యదర్శి గోవిందరాజులు పాల్గొన్నారు.

అనంతరం వైఎస్సార్ సీపీ గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు సచివాలయం పరిధిలో ఇంటింటికి పర్యటించి ఏపీకి జగనే ఎందుకు కావాలో వివరించారు ప్రజాభిప్రాయం సేకరించారు. చైతన్యనగర్ సెంటర్‌లో వైఎస్సార్ సీపీ జెండాను ఎగురవేశారు. అంతకుముందు కాకినాడ 1వ డివిజన్ పరిధిలో వైద్యనగర్‌లో సచివాలయంలో నిర్వహించిన ఏపీకి జగనే ఎందుకు కావాలి కార్యక్రమంలో ఎమ్మెల్యే కన్నబాబు పాల్గొన్నారు. సంక్షేమ పథకాలకు సంబంధించి లబ్ధిదారులకు అందజేసిన వివరాలకు సంబంధించిన బోర్డును ఆవిష్కరించారు. కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు, డిప్యూటీ కమిషనర్ కోన శ్రీనివాస్, టీపీఆర్వో మానే కృష్ణమోహన్, నాయకులు వాసిరెడ్డి సూరిబాబు పాల్గొన్నారు.

'బాబు'-పవన్‌ల మాయమాటలు నమ్మొద్దు: వై ఏపీ నీడ్స్ జగన్‌లో ఎమ్మెల్యే ద్వారంపూడి

కాకినాడ: రానున్న ఎన్నికలలో లబ్ధి పొందేందుకు తప్పుడు వాగ్దానాలతో ప్రజల ముందుకొస్తోన్న టీడీపీ, జనసేన అధినేతలు చంద్రబాబు, పవన్ కల్యాణ్ మాయమాటలు నమ్మొద్దని కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి ప్రజలకు సూచించారు. స్థానిక 9వ డివిజన్‌లో మంగళవారం జరిగిన వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ప్రభుత్వ పథకాల లబ్ధికి సంబంధించి ఏర్పాటు చేసిన ప్రదర్శన బోర్డును ఎమ్మెల్యే ద్వారంపూడి ఆవిష్కరించారు. ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, వైఎస్సార్ సీపీ నగరాధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, ఏఎంసీ చైర్‌పర్సన్ పసుపులేటి వెంకటలక్ష్మి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ద్వారంపూడి మాట్లాడుతూ ఇచ్చిన మాటకు కట్టుబడి అర్హత కలిగిన ప్రతీ లబ్ధిదారునికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ నవరత్న పథకాల ద్వారా సంక్షేమ ఫలాలు అందించారు. దివంగత మాజీ ముఖ్యమంత్రులు ఎన్‌టీఆర్ పేరిట కిలో రెండు రూపాయలు బియ్యం పథకం, మహానేత వైఎస్సార్ పేరుతో ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి పథకాలు ప్రజల్లో చిరస్థాయిగా నిలిచిపోయాయన్నారు. ప్రస్తుత సీఎం జగన్ కూడా అమ్మ ఒడి, చేయూత సహా అనేక సంక్షేమ పథకాల అమలు ద్వారా ప్రజల హృదయాలను గెలుచుకున్నారన్నారు. 14 ఏళ్ల సీఎంగా పనిచేసిన చంద్రబాబు పేరుతో ఒక్క పథకం కూడా లేదన్న వాస్తవాన్ని ప్రజలు గమనించాలన్నారు. మరోసారి తప్పుడు వాగ్దానాలతో సిద్ధమవుతూ పొత్తులతో ముందుకొస్తోన్న ఆయనకు ప్రజలే బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. అర్హతే ప్రాతిపదికగా పారదర్శకంగా సంక్షేమ ఫలాలు అందిస్తోన్న సీఎం జగన్‌ను ప్రజలు మరోసారి ఆశీర్వదించాలని ఎమ్మెల్యే ద్వారంపూడి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్ మీసాల ఉదయ్‌కుమార్, స్మార్ట్‌సిటీ మాజీ చైర్మన్ అల్లి రాజబాబు, జేసీఎస్ కన్వీనర్ సుంకర విద్యాసాగర్, మాజీ కార్పొరేటర్ కంపర బాబి, పలకా సూర్యకుమారి పాల్గొన్నారు.

సీఎం జగన్‌కు అండగా..

కరప: ప్రజల సంక్షేమంకోసం నిరంతరం ఆలోచన చేసి, నవరత్నాలు, ఇతరసంక్షేమ పథకాలు అమలుచేస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి అండగా నిలబడాలని ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు యాళ్ల సుబ్బారావు కోరారు. గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి, నిధుల మంజూరు చేయిస్తూ, అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న ఎమ్మెల్యే కురసాల కన్నబాబును వచ్చే ఎన్నికల్లో మళ్లీ గెలిపించి, తద్వారా జగన్‌ను తిరిగి సీఎంను చేయాలన్నారు. కొంగోడులో మంగళవారం స్థానిక నాయకులతో కల్సి వారు 'ఆంధ్రప్రదేశ్‌కి జగనే ఎందుకు కావాలంటే...' కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా గ్రామ సచివాలయం వద్ద అధికారులతో కల్సి వివిధ ప్రభుత్వ సంక్షేమ పథకాల డిస్‌ప్లే బోర్డ్‌ను ఆవిష్కరించారు. నోడల్ అధికారి, ఈఓపీఆర్డీ ఎస్‌వీ శ్రీనివాసరావు మాట్లాడుతూ గ్రామసచివాలయం ద్వారా ప్రభుత్వం అందిస్తున్న సేవలు, సంక్షేమ పథకాల గురించి వివరించారు. గ్రామసర్పంచ్ నక్కా అప్పలస్వామి(బాబులు) మాట్లాడుతూ 25 డీబీటీ, 4 నాన్ డీబీటీ, 4 ఫ్లాగ్ స్లిప్ ప్రోగ్రాంల ద్వారా కొంగోడు సచివాలయం పరిధిలో రూ.17.50 కోట్లు ప్రభుత్వం మంజూరు చేసిందని తెలిపి, గ్రామంలో జరిగిన, జరుగుతున్న అభివృద్ధి పనుల గురించి వివరించారు. గ్రామవలంటీర్లకు ఏపీకి జగనే ఎందుకు కావాలంటే.. బుక్‌లెట్‌లు ఉన్న బ్యాగులను ఎంపీపీ శ్రీలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు సుబ్బారావు అందజేశారు. గ్రామవలంటీర్ ఏడురోజులు పాటు ఇంటింటికీ వెళ్లి ఏపీకి జగనే ఎందుకు కావాలంటే.. బుక్‌లెట్‌లను అందజేసి, ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వివరించాలన్నారు. అనంతరం గ్రామంలోని కూడలిలో వైఎస్సార్ సీపీ పతాకాన్ని ఆవిష్కరించారు. మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు చింతా ఈశ్వరరావు, మండల వ్యవసాయ సలహామండలి చైర్మన్ కోట వెంకటేశ్వరరావు, మండల సచివాలయాల కన్వీనర్ కాదా వెంకటేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యురాలు వనుం అనంతలక్ష్మి, వైఎస్సార్ సీపీ నాయకులు పెంకే సత్తిబాబు, వనుం గంగరాజు పాల్గొన్నారు.

నేటి బాలలే రేపటి పౌరులు

బాలల దినోత్సవంలో ఎమ్మెల్యే కన్నబాబు



నెహ్రూ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ కృతికా శుక్లా, రూరల్ ఎమ్మెల్యే కన్నబాబు

కాకినాడ రూరల్: భావితరంతోనే దేశం సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని, నేటి బాలలే రేపటి పౌరులని ఎమ్మెల్యే కురసాల కన్నబాబు పేర్కొన్నారు. రమణయ్యపేట ఈశ్వర్‌నగర్‌లో మోహన్ విద్యాసంస్థల్లో మంగళవారం మధ్యాహ్నం జరిగిన బాలల దినోత్సవంలో ఎమ్మెల్యే కన్నబాబు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. తొలుత చాచా నెహ్రూ చిత్రపటానికి నివాళులర్పించి, జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని కన్నబాబు ప్రారంభించారు. చిన్నారులు ఆట, పాటలను కొద్దిసేపు తిలకించారు. అనంతరం మోహన్ విద్యా సంస్థల కరస్పాండెంట్ ఎం.మోహనరావు అధ్యక్షతన జరిగిన వేడుకల్లో శాంతి పావురాలను ఎగురవేశారు. విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బాలల దినోత్సవం శుభాకాంక్షలు తెలియజేశారు. బాల్యం తిరిగిరాని జ్ఞాపకమని, చదువులతో పాటు ఆటపాటలతో సరదాగా గడపాలన్నారు. కార్యక్రమంలో ఆర్డేడీ రాజు, ఎంఈఓలు గణేష్‌బాబు, ఏసుదాసు, వైఎస్సార్ సీపీ నేతలు లింగం రవి, తోటకూర శ్రీను, గగారిన్, గిరీష్, మోకా కృష్ణంరాజు పాల్గొన్నారు.

ఈశ్వర్‌నగర్ కాలనీ అసోసియేషన్ సన్మానం

ఈశ్వర్‌నగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు మాజీ ఎంపీడీఓ విశ్వనాథరెడ్డి తదితరులు ఎమ్మెల్యే కురసాల కన్నబాబును సన్మానించారు. తమ సమస్యలు పరిష్కరించినందుకు ధన్యవాదాలు తెలియజేశారు. పలు విన్నపాలతో కూడిన వినతి పత్రం అందజేశారు.

బాలల దినోత్సవం

బోట్‌క్లబ్: రోటరీ గోల్డెన్‌జూబ్లీక్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక కంపర వీణారావు మున్సిపల్ స్కూల్‌లో బాలల దినోత్సవం నిర్వహించారు. క్లబ్ అధ్యక్షుడు నరహరిశెట్టి రవికృష్ణ ఆధ్వర్యంలో చిన్నారులకు పలు సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటల పోటీలు నిర్వహించి వారికి బహుమతులు అందించారు. క్లబ్ కార్యదర్శి జోగా చంద్రరావు, కోశాధికారి పవన్‌కుమార్, సభ్యులు నల్లమిల్లి మాచారెడ్డి, ఎస్ చిరంజీవి రెడ్డి, లంక సాయిబాబా పాల్గొన్నారు.

కాకినాడ సిటీ: జవహర్‌లాల్ నెహ్రూ 134వ జయంతిని తూరంగి అల్లూరి సీతారామరాజు కాలనీలో అల్లూరి బాలల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. తూరంగి మాజీ సర్పంచ్ బలగం ప్రసన్నకుమార్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కాలనీ అభివృద్ధి కమిటీ నాయకులు పొట్నూరి జయప్రకాష్, స్థానిక నాయకులు వేపాడ శ్రీను, తటవర్తి సుబ్బారావు, కింతాడ నరసింహమూర్తి, సిహెచ్ అజయ్‌కుమార్ తదితరులు కాలనీలో పార్కు, వాకింగ్ ట్రాక్ నిర్మిస్తునందుకు ఎమ్మెల్యే కన్నబాబుకు ధన్యవాదాలు తెలిపారు. అంగన్‌వాడీ కార్యకర్తలు సీహెచ్ విజయ, కె.శుభ, జ్యోతి, వీరవేణి, క్రాంతికుమారి, కక్కల లక్ష్మి, దుర్గ పాల్గొన్నారు.

కరప: మండలంలోని పలు పాఠశాలల్లో మంగళవారం దేశ ప్రథమ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ జయంతి సందర్భంగా బాల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. వాకాడలోని మండల ప్రజాపరిషత్ ప్రాథమిక పాఠశాలలో హెచ్ఎం ఎ.శ్రీనివాస్ ఆధ్వర్యలో బాలదినోత్సవం నిర్వహించారు. జనవిజ్ఞానవేదిక ప్రతినిధి వడ్డమూరి శ్రీరామారావు మాట్లాడుతూ మాజీప్రధాని నెహ్రూ సైన్స్‌అండ్ టెక్నాలజీని ఎంతో అభివృద్ధి పరచారన్నారు.

నెహ్రూ అడుగుజాడల్లో పయనించాలి

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): నెహ్రూ అడుగుజాడల్లో ప్రతి విద్యార్థి పయనించాలని జేఎన్‌టీయూకే వీసీ డాక్టర్ జీవీఆర్ ప్రసాదరాజు పేర్కొన్నారు. పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ 134వ జయంతి వేడుకలు వర్సిటీ ఆవరణలో మంగళవారం నిర్వహించారు. ముందుగా వర్సిటీ ప్రధాన ద్వారంలో ఉన్న నెహ్రూ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రిజిస్ట్రార్ సుమలత, ప్రిన్సిపాల్ డాక్టర్ కృష్ణప్రసాద్ పాల్గొన్నారు.

కాకినాడ సిటీ: నెహ్రూ జయంతి సందర్భంగా మంగళవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ కృతికా శుక్లా, కాకినాడ రూరల్ ఎమ్మెల్యే కురసాల కన్నబాబు నివాళులర్పించారు. జిల్లా వ్యవసాయ సలహా మండలి కమిటీ చైర్మన్ లంకా ప్రసాద్, అధికారులతో కలిసి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వ్యవసాయ శాఖ జేడీ విజయకుమార్, ఎస్ఈ ఇరిగేషన్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో..

కాకినాడ సిటీ: నెహ్రూ జయంతి కార్యక్రమాన్ని కాకినాడ నగర కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించారు. పార్టీ నాయకులు దాట్ల గాంధీరాజు, ఆకుల వెంకటరమణ, పెద్దాడ సుబ్బారాయుడు కుళాయి చెరువు ఆవరణలో ఉన్న నెహ్రూ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

గ్రంథాలయాలకు ఎప్పటికీ ఆదరణ తగ్గదు



గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభిస్తున్న విద్యాశాఖ ఆర్‌జేడీ నాగమణి

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): గ్రంథాయాలకు ఆదరణ ఎప్పటికీ తగ్గదని, సాంకేతిక ఎంత అభివృద్ధి చెందినా వాటి ప్రాబల్యం అలాగే ఉంటుందని విద్యాశాఖ ఆర్‌జేడీ జి.నాగమణి పేర్కొన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం కాకినాడ ప్రధాన గ్రంథాలయంలో నిర్వహిస్తున్న జాతీయ గ్రంథాలయ 56వ వారోత్సవాల్లో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఒక మంచి పుస్తకం వందమంది స్నేహితులతో సమానమని, గ్రంథాలయాల బాట పట్టేందుకు ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపడుతుందన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ప్రసాద్ మాట్లాడుతూ గత ఏడాది జిల్లాలో ఉన్న అన్ని గ్రంథాలయాలకు దాదాపు కోటి రూపాయలతో పుస్తకాలు కొనుగోలుచేసి పంపిణీ చేశామని, విద్యార్థులకు, కాంపిటీటివ్ పోటీ పరీక్షలకు, ఇలా అన్ని వర్గాలకు ఉపయోగపడే పుస్తకాలు అందుబాటులో ఉంచామన్నారు. జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రంథాలయాల్లో వారం రోజుల పాటు వివిధ అంశాలపై అవగాహనతో పాటు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహిస్తున్నామని, ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. రాష్ట్ర పౌరగ్రంథాలయ శాఖ ఏడీ రవికుమార్, రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ సభ్యులు జి.మహేష్, దూలం వెంకన్నబాబు, తుమ్మలపల్లి జయకృష్ణ, కె.కిషోర్ పాల్గొన్నారు.

కరప: విజ్ఞానాన్ని పెంపొందించుకునేందుకు ఏర్పాటు చేసిన గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని గ్రామ సర్పంచ్ సాదే ఆశాజ్యోతి అన్నారు. స్థానిక శాఖాగ్రంథాలయంలో మంగళవారం నిర్వహించిన 56వ జాతీయ గ్రంథాలయాల వారోత్సవాల సందర్భంగా మాజీ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించి ఆమె మాట్లాడారు. రికార్డు అసిస్టెంట్ ఇన్‌చార్జి లైబ్రేరియన్ ఎన్‌వీఎస్ ఫణీంద్ర కుమార్, మాజీ సర్పంచ్ పోలిశెట్టి తాతీలు, వైఎస్సార్ సీపీ నాయకుడు సాదే లోహిదాస్, నక్కా సూర్యచంద్రేశ్వరరావు, విశ్వనాథం పాల్గొన్నారు. వేళంగిలోని శాఖా గ్రంథాలయంలో లైబ్రేరియన్ పాట్నీడి వెంకటరంగయ్య ఆధ్వర్యంలో గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించారు.

పీఆర్ కళాశాలలో..

కాకినాడ సిటీ: పీఆర్ కళాశాలలో గ్రంథాలయ వారోత్సవాలను ప్రిన్సిపాల్ బీవీ తిరుపాణ్యం ప్రారంభించారు. విద్యార్థులకు 14న వ్యాసరచన పోటీ, 15న డిబేట్ కాంపిటేషన్, 16న డ్రాయింగ్ పోటీ, 17న గెస్ట్‌లెక్చర్, 18న బుక్ కాంప్రహెన్షన్, 20న ముగింపు కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. కళాశాల నుంచి ర్యాలీ నిర్వహించారు.

పుస్తక పఠనంతో విజ్ఞానం

బాలాజీచెరువు: పుస్తక పఠనం ద్వారా విజ్ఞానం మరింత పెంపొందించుకోవచ్చని రాష్ట్ర గ్రంథాలయ అసిస్టెంట్ డైరెక్టర్ రవికుమార్ పేర్కొన్నారు. గాంధీనగర్‌శాఖ గ్రంథాలయం ఆధ్వర్యంలో కుళాయిచెరువు పార్కు గ్రంథాలయంలో మంగవారం నిర్వహించిన జాతీయ గ్రంథాలయ 56వ వారోత్సవాలు ప్రారంభించి మాట్లాడారు. గ్రంథాలయాధికారి ములంపాక శ్రీనివాసరావు పాల్గొన్నారు. రామకృష్ణారావుపేట శాఖ గ్రంథాలయంలో నిర్వహించిన వేడుకల్లో రిటైర్డ్ డిప్యూటీ లేబ్రేరియన్ సలాది సాయి సత్యనారాయణ హాజరయ్యారు.


సాగునీటి సమస్యపై కలెక్టర్‌కు వినతి



కలెక్టర్ కృత్తికాశుక్లాకు వినతిపత్రం ఇస్తున్న కరప నాయకులు, రైతులు

కరప: రబీలో సాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని, పంటకాలువలో పూడిక తీయించాలని కోరుతూ కరప మండలంలోని ఆరు గ్రామాల రైతులతో కలసి స్థానిక నాయకులు కలెక్టర్ కృత్తికాశుక్లాకు వినతిపత్రం సమర్పించారు. కాకినాడ కలెక్టరేట్‌లో మంగళవారం జరిగిన జిల్లా వ్యవసాయ సలహా మండలి సమావేశం వద్దకు జెడ్పీటీసీ సభ్యుడు యాళ్ల సుబ్బారావు, ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి, మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు చింతా ఈశ్వరరావు, పార్టీ నాయకులు, రైతులు బండే తాతాజీ, రెడ్డి వీరభద్రరావు, సోడగం సూరిబాబు, పెంకే సత్తిబాబు, కొత్త రవి తదితరులు కలెక్టర్‌ను కల్సి ఎమ్మెల్యే కురసాల కన్నబాబు సమక్షంలో వినతిపత్రం సమర్పించారు. మండలంలోని అరట్లకట్ట, గొడ్డటిపాలెం, జెడ్.భావారం, కొరిపల్లి, కరప, పేపకాయలపాలెం, శహపురం గ్రామాలకు చింతపల్లి లాకుల నుంచి సంపర మీదుగా శహపురం వరకు వస్తున్న పంటకాలువ పూడికపోయి సాగునీరు సక్రమంగా సరఫరా కాక ఏటా సాగునీటి ఎద్దడిని ఎదుర్కొంటున్నాం. సాగునీరందక పంటపొలాలు ఎండిపోతున్నాయి. ఈ కాలువపై 3,400 ఎకరాల ఆయకట్టు ఉంది. చింతపల్లి లాకుల నుంచి శహపురంలోని అక్కిరేవు వరకు పూడిక తీయించకపోతే ఈ ఏడాది రెండవ పంట వేసే పరిస్థితి ఉండదు. రబీ సీజన్ ప్రారంభించేలోగా పూడికతీత పనులు చేయించి, ఆదుకోవాలని కలెక్టర్ కృత్తికాశుక్లాకు ఇచ్చిన వినతిపత్రంలో పేర్కొన్నారు. కలెక్టర్ స్పందించి చర్యలు తీసుకుంటామన్నారని స్థానిక నాయకులు తెలిపారు.

నిత్యాన్నదానం ప్రారంభం



నిత్యాన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే చంద్రశేఖరరెడ్డి

కాకినాడ సిటీ: కార్తికమాస పర్వదినాన్ని పురస్కరించుకుని కాకినాడ భానులింగేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి నిత్యాన్నదానాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కార్తిక మాస పుణ్య దినాల్లో చేపట్టే యజ్ఞయాగాలు, ప్రత్యేక పూజల ద్వారా ప్రజలకు సమస్త సుఖాలు లభించాలని ఆకాంక్షించారు. స్వామివారి చిత్రపటానికి హారతి ఇచ్చి అయ్యప్ప స్వాములు, భవాని దీక్షదారులు, శివమాల ధరించిన భక్తులకు అన్న వితరణ చేశారు. ఐఎన్‌టీయూసీ నాయకులు సిరిమల్ల లక్ష్మీనారాయణ ఎమ్మెల్యే చంద్రశేఖరరెడ్డికి తిరుమల తిరుపతి దేవస్థానం2024 నూతన సంవత్సర క్యాలెండర్, డైరీని బహూకరించారు. భానులింగేశ్వరస్వామి ఆలయ చైర్మన్ వాకాడ సత్యనారాయణ, ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, సిటీ వైఎస్సార్ సీపీ అధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ చైర్‌పర్సన్ పసుపులేటి వెంకటలక్ష్మి, నల్లమిల్లి బుచ్చిరెడ్డి పాల్గొన్నారు.

పారిశుధ్య పనుల తనిఖీ

కాకినాడ: దీపావళి పండగ నేపథ్యంలో పారిశుధ్యం క్షీణించకుండా అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ సీహెచ్ నాగ నరసింహారావు పారిశుధ్య విభాగాన్ని ఆదేశించారు. మంగళవారం ఆయన 14, 15 సర్కిల్స్ పరిధిలోని శాంతినగర్, కొత్త కాకినాడ ప్రాంతాల్లో పర్యటించి పారిశుధ్య పనులను తనిఖీ చేశారు. ఆదివారం, పండగ సెలవుల నేపథ్యంలో చెత్త ఎక్కడికక్కడ పేరుకుపోకుండా ప్రత్యేక పర్యవేక్షణ చేపట్టాలని ఆయన కోరారు. ఆయన వెంట శానిటరీ సూపర్‌వైజర్ జిలాని, సిబ్బంది ఉన్నారు.

ఘనంగా సహకార వారోత్సవాలు



పెనుగుదురు పీఏసీఎస్ వద్ద సహకార జెండా ఆవిష్కరణ

కరప: మండల పరిధిలోని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల (పీఏసీఎస్) కార్యాలయాల వద్ద మంగళవారం 70వ జాతీయ సహకార వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. పెనుగుదురు, కరప, జెడ్.భావారం, వేములవాడ, కూరాడ, యండమూరు, పెద్దాపురప్పాడు గ్రామాల్లో పీఏసీఎస్ కార్యాలయాలు ఉన్నాయి. పెనుగుదురు పీఏసీఎస్ కార్యాలయం వద్ద పీఏసీఎస్.రవికుమార్ జెండా ఆవిష్కరించి, మాట్లాడుతూ సహకార జెండాలోని ఏడురంగుల విశిష్టతను వివరించారు. సీఈఓ పి.నాగేశ్వరరావు మాట్లాడుతూ సంఘం ఆవిర్భావం నుంచి ఎన్నికైన అధ్యక్షుల గురించి, వారు చేసిన అభివృద్ధిని, పీఏసీఎస్ పురోభివృద్ధిని వివరించారు. కాకినాడ డీసీసీబీ సర్కిల్ సూపర్‌వైజర్ ఎస్‌కే బషీర్, రెడ్డిపల్లి రమేష్ పాల్గొన్నారు. ఆయా కార్యాలయాల వద్ద సొసైటీ సీఈఓలు రైతులు, సిబ్బందితో కల్సి సహకార జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశాల్లో ప్రత్యేకాధికారులు, సీఈఓలు మాట్లాడుతూ మాజీ ప్రధాని జవహర్‌లాల్‌నెహ్రూ జయంతి రోజున జాతీయ సహకార వారోత్సవాలు ప్రారంభించి ఏడురోజులపాటు సహకార సంఘాల ద్వారా వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. సంఘం పరిధిలో రైతులకు అందజేస్తున్న దీర్ఘ, స్వల్పకాలిక రుణాలు, సంఘ కార్యకలాపాలను గురించి వివరించారు.

సహకార వ్యవస్థతో బహుళ ప్రయోజనాలు

కాకినాడ: సహకార వ్యవస్థను బలోపేతం చేసుకోవాల్సిన అవసరం ఎంతో ఉందని ది కాకినాడ కో-ఆపరేటివ్ బిల్డింగ్ సొసైటీ ఉపాధ్యక్షుడు రెడ్డి వీరరాజేంద్రకుమార్ పేర్కొన్నారు. స్థానిక కేసీబీఎస్ కార్యాలయ ఆవరణలో మంగళవారం 70వ అఖిల భారత సహకార వారోత్సవాలను ఘనంగా ప్రారంభించారు. కార్యదర్శి ముమ్మిడి గోవిందు, ఇతర డైరెక్టర్లతో కలిసి సహకార పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఉపాధ్యక్షుడు రెడ్డి వీరరాజేంద్రకుమార్ మాట్లాడుతూ సహకార రంగంలో ఏర్పాటైన కేసీబీఎస్ సభ్యుల తోడ్పాటుతో అంచలంచెలుగా ఎదిగి ఇతర సంఘాలకు ఆదర్శంగా నిలిచిందన్నారు. కార్యదర్శి ముమ్మిడి గోవిందు మాట్లాడుతూ సభ్యుల ఆకాంక్షలకు అనుగుణంగా కేసీబీఎస్ సేవలను మరింత విస్తరించామన్నారు. ఈ నెల 20వ తేదీ వరకు సహకార వారోత్సవాలను నిర్వహిస్తున్నామని చెప్పారు. సహకార రంగంలేని వ్యవస్థ లేదని, ఈ వ్యవస్థ ద్వారానే దేశాభివృద్ధి ముడిపడి ఉందన్న నెహ్రూ ఆశయాలకు అనుగుణంగా ప్రతీ ఒక్కరు పనిచేయాలన్నారు. ఈ సందర్భంగా జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సహకార ఉద్యోగులు సహకార గీతాన్ని ఆలపించారు. సంస్థ డైరెక్టర్లు ముత్తా మధు, ముమ్మిడి వెంకటరమణ, ఇన్‌చార్జి మేనేజర్ గంగాధరం పాల్గొన్నారు.

కార్తిక సందడి ఆరంభం



భానుగుడి భానులింగేశ్వరస్వామికి క్షీరాభిషేకం నిర్వహిస్తున్న అర్చకుడు

బోట్‌క్లబ్: కార్తికమాసంలో తొలిరోజు మంగళవారం ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజాము నుంచి ఆలయాల్లో భక్తులు ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. భక్తుల తాకిడిని దృష్టిలో ఉంచుకొని ఆలయాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. స్థానిక దేవాలయం వీధిలోని బాలాత్రిపుర సుందరి సమేత భీమేశ్వరస్వామి ఆలయంలో ఆలయ ప్రధాన అర్చకులు కొడమంచిలి కార్తీక్ ఆధ్వర్యంలో స్వామివారికి పంచామృతాభిషేకాలు నిర్వహించారు. స్థానిక భానులింగేశ్వర స్వామి ఆలయంలో తెల్లవారుజాము నుంచి భక్తులు దర్శనం కోసం క్యూ కట్టారు. ఆలయ ప్రధాన అర్చకులు హరిప్రసాద్ ఆధ్వర్యంలో పంచామృతాభిషేకాలు నిర్వహించారు. ఆలయంలో భక్తులు ఉచిత అన్నదానాన్ని ఆలయ కమిటీ చైర్మన్ వాకాడ వీరవెంకట సత్యనారాయణ ప్రారంభించారు. రామారావుపేటలోని శివాలయంలో భక్తులు దర్శనం కోసం క్యూ కట్టారు. జగన్నాథపురం, సాంబమూర్తినగర్‌లోని శివాలయాల్లో భక్తులు స్వామిని దర్శించుకొని పూజలు నిర్వహించారు.

కరప: మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం మహిళలు కార్తిక మాసం పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. విష్ణు, శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. మహిళలు కాలువలు, చెరువుల వద్దకు వెళ్లి పాడ్యమి దీపాలు వదిలారు.

రాష్ట్రస్థాయి ఖో-ఖో పోటీలకు చురుగ్గా ఏర్పాట్లు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): జిల్లా పాఠశాల క్రీడాసమాఖ్య అండర్-14, 17 ఆధ్వర్యంలో కాకినాడ జిల్లా క్రీడా మైదానంలో జరగనున్న 67వ అంతర్ జిల్లాల అండర్-17 బాలబాలికల ఖో-ఖో పోటీలకు ఏర్పాట్లు చురుగ్గా జరుగుతున్నాయి. ఈ నెల 16 నుంచి 18 వరకు జరిగే ఈ పోటీలకు ఉమ్మడి జిల్లాల ప్రాతిపదికన 13 జిల్లాల నుంచి 400 మంది బాలురు, బాలికలు, కోచ్‌లు, మేనేజర్లు హాజరవుతున్నారు. పోటీల నిర్వహణకు నాలుగు ఖో-ఖో కోర్టులను నిర్వాహకులు సిద్ధం చేస్తున్నారు. బాలికలకు డీఎస్ఏలోను, బాలురకు గుడారిగుంట, రమణయ్యపేట, వాకలపూడిలోని ప్రభుత్వ పాఠశాలల్లో వసతి ఏర్పాట్లు చేశారు. పోటీల నిర్వహణ కార్యదర్శి ప్రసాద్, అసిస్టెంట్ నిర్వహణ కార్యదర్శిగా ఖో-ఖో సంఘ జిల్లా కార్యదర్శి పట్టాభి ఏర్పాటు పర్యవేక్షిస్తున్నారు.